

● అమ్మ దర్శనం



సీఎం చంద్రబాబు దంపతులకు దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు. చిత్రంలో ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

సంతోషాలపై సంతకాలు



రెండు జిల్లాల్లో ఆనందాన్ని నింపిన చంద్రబాబు హామీలు

సంతకాలు ఐదే.. కానీ, ఆరు లక్షల మంది ఆకాంక్షలకు అవే ఆశాదీపికలు.. అన్నీ తొలి సంతకాలే.. కానీ, ఐదేళ్లుగా పడుతున్న వెతలను తీర్చే సంకేతాలు.. ముదుసలుల ఆర్థిక అవసరాలకు అవే అండదండలు.. నిరుద్యోగ యువత భవిత మార్చే కలల వారధులు.. పేదవాడి ఆకలి తీర్చే అక్షయపాత్రలు.. సొంతభూమిపై పెత్తందారుల పెత్తనాన్ని తెగనరికే చురకత్తులు.. ఇన్నాళ్లూ సామాన్యుడు ఆశగా ఎదురుచూసిన పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పాటు గత ప్రభుత్వ భూరక్ష పథకాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు గురువారం తొలి సంతకాలు చేయడంపై రెండు జిల్లాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వీటిద్వారా లబ్ధిపొందే దాదాపు ఆరు లక్షలమంది మోముల్లో చిరునవ్వుల పూలు పూశాయి.
- (విజయవాడ-ఆంధ్రజ్యోతి)

- ఐదు సంతకాలతో దాదాపు ఆరు లక్షలమందికి లబ్ధి
- 4.78 లక్షల మంది పింఛన్‌దారుల్లో సందడే సందడి
- 50 వేల మంది ఆకలి తీర్చనున్న అన్న క్యాంటీన్లు
- 60వేల పైచిలుకు నిరుద్యోగులకు మెగా డీఎస్సీ వరం

ఆనందమని'పింఛెన్'

ఎన్టీఆర్ జిల్లాలో అన్ని రకాల పింఛన్లు పొందే వారి సంఖ్య 2.35 లక్షలు. ప్రతినెలా వీరికి రూ.70.45 కోట్లు వెచ్చిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది రూ.3 వేలు పింఛన్ పొందుతుండగా, కొద్దిమంది (40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు) దివ్యాంగుల పింఛన్ రూ.4 వేలు పొందుతున్నారు. రూ.3 వేలు పింఛన్‌ను చంద్రబాబు రూ.4 వేలు చేశారు. ఏప్రిల్, మే, జూన్ బకాయిలు రూ.వెయ్యి చొప్పున కలిపి జూలైలో మొత్తం రూ.7 వేలు అందించనున్నారు. దీంతో జూలైలోనే ఎన్టీఆర్ జిల్లాలో పింఛన్లకు రూ.164 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. కృష్ణాజిల్లాలో అన్ని రకాల పింఛన్లు పొందే వారి సంఖ్య 2.42 లక్షలు. ప్రతినెలా వీరికి రూ.71.57 కోట్లు వెచ్చిస్తున్నారు. జూలైలో మొత్తం రూ.167 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

అన్నార్తులకు వరాలు

అన్నార్తుల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018, జూలై 11న ప్రారంభించింది. పేదోడికి తక్కువ ధరకే కడుపునిండా భోజనం పెట్టాలన్న లక్ష్యంతో ప్రారంభమైన వీటిని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. 2019, జూలై 31 నుంచి మూసేసింది. వాటిలో గ్రామ సచివాలయాలు వంటి వాటిని ఏర్పాటు చేశారు. కొన్నింటిని పాడుబెట్టారు. మూతపడే నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో 24 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. వాటిలో రోజూ అల్పాహారం కానీ, భోజనాలు కానీ సుమారు 50 వేల మంది చేసేవారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనాన్ని కేవలం రూ.5కే తినే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రద్దు చేయడంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో చాలాచోట్ల టీడీపీ నాయకులు వాటిని సొంత ఖర్చుతో నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో టీడీపీ ఎంపీగా గెలుపొందిన కేశినేని చిన్ని సుమారు 50 పైచిలుకు అన్న క్యాంటీన్లను నిర్వహించేవారు. ఉయ్యూరులో టీడీపీ యువ నాయకుడు దండమూడి చౌదరి కూడా అన్న క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపేవారు. ఎట్టకేలకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై తొలి సంతకం చేయడం పేదల్లో సంతోషాన్ని నింపుతోంది.

మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

వైసీపీ సర్కార్ ఎన్నికలకు కొద్దినెలల ముందు డీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. కేవలం 6,100 ఉపాధ్యాయ ఖాళీలతో ఈ ప్రకటన వెలువడింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి సుమారు 60 వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో డీఎస్సీ నిర్వహణ అటకెక్కింది. తాజాగా చంద్రబాబు సీఎంగా చేసిన తొలి సంతకాల్లో మెగా డీఎస్సీ ఫైలు ఉంది. 16,347 ఉపాధ్యాయ ఖాళీలతో ఈ ప్రకటన విడుదల కానుంది. పెరిగిన పోస్టుల సంఖ్యతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి.

భూ యజమానుల్లో భయాన్ని పోగొట్టారు

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయడం ద్వారా సీఎం చంద్రబాబు సామాన్య ప్రజల్లో ఉన్న భయాందోళనను పారదోలారు. ప్రజల రాజ్యాంగ హక్కులను భంగపరిచేలా గత ప్రభుత్వం చేసిన ఈ చట్టం ప్రజల్లో భయాందోళనలకు దారితీసింది. ఈ చట్టం రద్దు కోసం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఎన్నో పోరాటాలు చేసింది. హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేసింది.

- సుంకర రాజేంద్ర ప్రసాద్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు

ఇక ఎవరి దగ్గరా చేయి చాపను



చంద్రబాబు తన హామీ నిలబెట్టుకోవడం అభినందనీయం. పింఛన్లను రూ.4 వేలకు పెంచి వృద్ధుల పాలిట పెద్దబిడ్డ అయ్యాడు. ఇకపై చిన్నచిన్న ఖర్చులకు మందులకు ఎవరి దగ్గర చేయి చాపాల్సిన అవసరం లేదు.

- లీల, విజయవాడ

● అమరావతిలో అపూర్వ స్వాగతం





బడి గంటలు మోగిన వేళ

జిల్లాలో గురువారం నుంచి బడి గంటలు మోగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. జిల్లాలోని 1797 పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్లు తరగతులకు హాజరయ్యారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోవడంతో పాఠశాలల ఆవరణలు సందడిగా మారాయి. కొన్ని పాఠశాలల్లో స్టూడెంట్‌ల కిట్‌లను విద్యాకమిటీ చైర్మన్‌ల చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

- మచిలీపట్నం



గుడివాడలో వంగిపోయిన స్తంభాలు

కురిసింది వాన..

జిల్లాలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గుడివాడలో రహదారులపై నీరు నిలిచింది. బస్టాండ్‌లోకి భారీగా నీరు చేరింది. దాదాపుగా గంటన్నర పాటు ఈదురుగాలులతో కూడిన వర్షంతో పలుచోట్ల రహదారి వెంబడి చెట్లు, స్తంభాలు నేలకొరిగాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మల్లాయి పాలెంలోని జగనన్న కాలనీ అంతర్గత రహదారులు నీట మునిగాయి. - గుడివాడ



గుడివాడలో నీటమునిగిన బస్టాండ్ ఆవరణ

కృష్ణా యూనివర్సిటీలో జవాబుపత్రాల గల్లంతు

- ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు వెల్లడి
- వీటిలో క్యాంపస్ కళాశాల ఫలితాలు మాయం
- జవాబుపత్రాలు కనిపించకేనని అనుమానం
- ఫలితాలు రాకుండానే రీవాల్యుయేషన్‌కు తేదీలు ప్రకటించిన అధికారులు
- అధికారుల తీరుతో విద్యార్థుల విస్మయం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వీసీ, రిజిస్ట్రార్
- గవర్నర్‌కు విద్యార్థుల ఫిర్యాదు
- అయోమయంలో 45 మంది భవిష్యత్తు



కృష్ణా యూనివర్సిటీ

'జవాబు' ఏది?



కృష్ణా యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారు. యూనివర్సిటీలోని క్యాంపస్ కళాశాల ఎంబీఏ విద్యార్థుల చివరి సెమిస్టర్ ఫలితాలు వెల్లడించకుండా గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. యూనివర్సిటీ పరిధిలోని చుట్టుపక్కల కళాశాలల విద్యార్థుల ఫలితాలు వెల్లడించి కేవలం క్యాంపస్ కళాశాలలోని 45 మంది విద్యార్థుల ఫలితాలు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై విద్యార్థులు అధికారులను అడిగితే తమకు సంబంధంలేదని ఎవరికివారు తప్పించుకుంటున్నారు. వీసీ, రిజిస్ట్రార్‌లకు ఫిర్యాదు చేసినా వారు ఏమీ తెలియనట్టు నటిస్తున్నారు. చివరికి విద్యార్థులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీలో గందరగోళం నెలకొంది. క్యాంపస్ కళాశాలలోని ఎంబీఏ విద్యార్థుల భవిషత్తుతో అధికారులు ఆటలాడుతున్నారు. క్యాంపస్ కాలేజీతోపాటు, నూజివీడు పీజీ సెంటరు, విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లోని కళాశాలల్లోని ఎంబీఏ విద్యార్థులకు ఆఖరు సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి నిర్వహించారు. జూన్ 1న ఫలితాలు వెల్లడించారు. ఈ ఫలితాల్లో యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థుల వివరాలు లేవు. ఖంగుతిన్న విద్యార్థులు ఎంబీఏ విభాగం హెచ్‌వోడీ చెరుకూరి జయచంద్రప్రసాద్ వద్దకు వెళ్లి అడిగారు. 'నేను హెచ్‌వోడీ పోస్టులో లేను. నన్ను ఆ పోస్టు నుంచి తప్పించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ వైకే సుందరకృష్ణ ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీ నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన వద్దకు వెళ్లి అడగండి' అని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ వద్దకు విద్యార్థులు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకుంటే తాను జూన్ 4వ తేదీన ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేశానని, ఎంబీఏ ఫలితాల వెల్లడి అంశం తనకు తెలియదని చెప్పి పంపేశారు. విద్యార్థులు వీసీకి, రిజిస్ట్రార్‌కు సమస్యను తెలిపినా వారు చూస్తామని చెప్పి పంపేశారు. ఇప్పటికీ ఆ విద్యార్థుల ఫలితాల వెల్లడించలేదు. దీంతో ఈ అంశంపై ఉన్నత విద్యామండలికి, గవర్నర్‌కు విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

ఫలితాల్లేకుండానే రీవాల్యుయేషన్‌కు తేదీలు ఖరారు

కృష్ణా యూనివర్సిటీలో పీజీ కోర్సులు ఎంఏ, ఎంకాం, ఎంహెచ్‌ఆర్ నాలుగో సెమిస్టర్ జవాబుపత్రాల రీవాల్యుయేషన్, పరిశీలన కోసం ఈనెల 18వ తేదీలోగా ఒక్కో పేపరుకు రూ.900 చొప్పున ఫీజుగా చెల్లించాలని కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆర్.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు రీవాల్యుయేషన్, స్వయంగా పరిశీలన కోసం ఈనెల 19వ తేదీలోగా ఒక్కో పేపరుకు రూ.1000 చొప్పున ఫీజుగా చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. క్యాంపస్ కళాశాల ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు వెల్లడించకుండానే రీవాల్యుయేషన్ తేదీలు ప్రకటించడంతో విద్యార్థులు ఖంగుతిన్నారు. ఇదే విషయంపై యూనివర్సిటీ అధికారులను ప్రశ్నిస్తే సాంకేతికలోపంతో క్యాంపస్ కళాశాలలో ఏంబీఏ కోర్సు నాలుగో సెమిస్టర్ ఫలితాలను వెల్లడించలేదని, కొంతకాలం వేచి ఉండాలని చెప్పి విద్యార్థులను పంపేస్తున్నారు.

అసలేం జరిగిందంటే...

కృష్ణా యూనివర్సిటీలోని అకడమిక్ బ్లాక్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరచడంతోపాటు, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు, పోలీసులు అకడమిక్ బ్లాక్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటులో భాగంగా ఎంబీఏ విభాగానికి చెందిన కార్యాలయం తాళాలను పగులగొట్టి అందులో ఉన్న పేపర్లు, ఇతరత్రా సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించారు. ఈ సమయంలోనే క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాలు కనపడకుండా పోయాయనే వాదన విద్యార్థుల నుంచి వినిపిస్తోంది. ఈ జవాబుపత్రాలు కనపడకపోవడంతో మూల్యాంకనం చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రకటించలేకపోయారు. ఈ అంశంపై యూనివర్సిటీకి చెందిన అధికారులు ఎవ్వరూ పెదవి విప్పకపోవడం గమనార్హం.

మస్తర్ల మాయాజాలం

- మైలవరంలో వెలుగుచూసిన అక్రమం
- జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు..
- వైసీపీ నాయకుల ఇళ్లల్లో, హోటళ్లలో పనిచేసిన వారికి జీతాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో మేజర్ గ్రామ పంచాయతీలు అవినీతికి నిలయాలుగా మారిపోయాయి. కృష్ణాజిల్లా గన్నవరం మేజర్ గ్రామ పంచాయతీలో వెలుగు చూసిన భారీ అవినీతి వ్యవహారాలు మరువక ముందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం మేజర్ గ్రామ పంచాయతీలోని అవినీతి వెలుగులోకి వచ్చింది. పంచాయతీ పారిశుధ్య విభాగంలో మస్తర్ల మాయాజాలం చోటుచేసుకోవటం ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై కలెక్టర్ దిల్లీరావు, జిల్లా పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ పాలకమండలి సమావేశంలో ఈ అంశాలపై పట్టుబట్టేందుకు వార్డు మెంబర్లు సిద్ధమౌతున్నారు. నూతన ప్రభుత్వం ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ చేయించాలన్న డిమాండ్ స్థానికంగా వ్యక్తమౌతోంది.



మైలవరంలోని మస్తర్ రిజిస్టర్ కాపీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మైలవరం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శానిటేషన్ విభాగంలో మొత్తం 72 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ పనిచేసేవారు 60 - 65 మధ్యనే ఉంటారు. వీళ్లంతా పంచాయతీ పరిధిలో శానిటేషన్ విధులు నిర్వహించాలి. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతల ఇంటి దగ్గర పనిచేసేవారు. నగరంలోని హోటళ్లలో పనిచేసేవారు. వీరంతా గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్నట్టుగా మస్తర్లు వేస్తున్నారు. మూడు నెలలుగా పంచాయతీ సిబ్బంది.. పట్టణంలో పూర్తిగా పనిచేయనే లేదు. కానీ మస్తర్లు వేసి జీతాలు డ్రా చేసుకున్నట్టు నిర్ధారణ అవుతోంది. వాస్తవానికి 72 మందికి జీతాలు డ్రా చేస్తున్నారు. 68 మందిని మాత్రమే చూపిస్తున్నారు. మరి మిగిలిన నలుగురు జీతాలను ఎవరు తీసుకుంటున్నారు? వారేమయ్యారు? వివరాల్లేవు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎక్కడెక్కడ శానిటరీ సిబ్బందికి విధులు వేస్తున్నారన్నదానికి రికార్డులు లేవు. ఏమేం పనులు చేయిస్తున్నారనేదానికి రికార్డులు లేవు. ఎంతసేపు పనిచేస్తున్నారో కూడా నమోదు లేదు. ఒక రకంగా చెప్పాలంటే.. శానిటేషన్ విభాగాన్ని మైలవరం గ్రామ పంచాయతీ అధికారులు మకిలి పట్టించారన్నమాట. వర్కర్లను కల్యాణ మండపాలకు సరఫరా చేయటం, ఫంక్షన్లు, పెళ్లిళ్లకు, దినకర్మల సందర్భంగా ఆహార వ్యర్థాలను తొలగించేందుకు ప్యాకేజీలు నిర్ణయించి పారిశుధ్య సిబ్బందిని, వాహనాలను పంపించటం వంటివి చేస్తున్నారు. డబ్బులు మాత్రం పంచాయతీ అధికారుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇలా పారిశుధ్య వ్యవస్థను భ్రష్టుపట్టించిన పంచాయతీ అధికారులపై చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావటంతో ఈ బాగోతాలు వెలుగులోకి వచ్చాయి.

శ్మశాన వాటిక పనుల్లో అవినీతి కంపు

మైలవరం పట్టణ పరిధిలోని బీసీ శ్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తం రూ.3.70 లక్షలు మంజూర య్యాయి. పనులు అత్యంత లోపభూయిష్టంగా జరుగుతున్నాయి. ఫెన్సింగ్ నిమిత్తం వేసిన స్తంభాలు విరిగిపోయాయి. ఫెన్సింగ్ కోసం ఐరన్ రాడ్ బెండింగ్ చేసి జాలీలను లోపల ఉంచి పోల్స్ తయారు చేసిన వాటినే ఉపయోగించాలి. ఒక్క ఐరన్ రాడ్డు కూడాలేని స్తంభాలను ఉపయోగించారంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవాల్సిందే. ఇంత నాసిరకం పనులు చేపట్టినా పంచాయతీ అధికారులు మాట్లాడకపోవటం గమనార్హం. వేసిన స్తంభాలు విరిగిపోతుంటే పంచాయతీ అధికారులు ఏ విధంగా బిల్లులు చెల్లిస్తారన్నది నిగ్గు తేలాల్సిన విషయం.



చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చిన్ని దంపతులు

సీఎం దంపతులకు పట్టువస్త్రాల అందజేత

▸ ఘనంగా సత్కరించిన ఎంపీ కేశినేని చిన్ని, జానకీలక్ష్మి దంపతులు

వన్‌టౌన్, జూన్ 13 : కనకదుర్గమ్మ దర్శనార్థం సీఎం హోదాలో మొదటిసారి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసిన చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరిలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆయన సతీమణి జానకి లక్ష్మిలు పట్టువస్త్రాలు సమర్పించారు. గురువారం అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వచన మంటపంలో చంద్రబాబు, భువనేశ్వరి దంపతులకు శివనాథ్ సతీసమేతంగా పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, కాకు మల్లిఖార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించిన శివనాథ్ దంపతులు

విజయవాడ కేశినేని శివనాథ్ సతీసమేతంగా గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఎంపీ హోదాలో తొలిసారిగా ఆయన ఆలయానికి విచ్చేయగా ఈవో కేఎస్ రామారావు తదితరులు ఆలయ మర్యాదలు అందజేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం తదితరాలు అందజేశారు. కేశినేని దంపతులు విఘ్నేశ్వరుడిని, దుర్గమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలపై దుర్గమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో పయనించాలని దుర్గమ్మ వారిని వేడుకొన్నట్టు తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రకు అభినందనలు..

చంద్రబాబు మంత్రివర్గంలో చోటు సంపాదించిన కొల్లు రవీంద్రను కేశినేని శివనాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. భాగ్యనగర్ కాలనీలోని మంత్రి నివాసానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌లతో కలిసి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యచరణపై ముచ్చటించారు.



చంద్రబాబును కలిసిన సీపీఐ నేతలు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుడిని సీపీఐ నేతలు వెలగపూడిలోని సచివాలయంలో గురువారం సాయంత్రం కలిశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు మనోహరనాయుడు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



చంద్రబాబు సమక్షంలో సోదరితో కలిసి చెక్కు ఇస్తున్న బుద్దా వెంకన్న

అన్నవితరణకు బుద్దా వెంకన్న విరాళం..

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నవితరణకు గురువారం దేవస్థానానికి విచ్చేసిన సీఎం చంద్రబాబు సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఆయన సోదరి జగదీశ్వరిలు రూ. 1,51,116లు చెక్కును విరాళంగా అందజేశారు. ఈవో కేఎస్ రామారావుకు సీఎం ఆ చెక్కును అందజేశారు.

బుద్దా వెంకన్న, నాగుల్‌మీరాకు గజమాలతో సత్కారం

ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినందుకు విజయవాడ హోల్‌సేల్ పూలమార్కెట్ వర్తక సంఘం నాయకులు గురువారం టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్‌మీరాలను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుండు అశోక్ కుమార్, కార్యదర్శి విఠల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులపై సీఐ అత్యుత్సాహం

వన్‌టౌన్, జూన్ 13 : వైసీపీ ప్రభుత్వం మారిన ఇంకా పోలీస్ విభాగంలో కొందరు అధికారులు జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అనే భ్రమలోనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీసమేతంగా దుర్గమ్మను దర్శించుకోవడానికి దేవస్థానానికి విచ్చేసిన సందర్భంగా కొండపైన స్పెషల్ బ్రాంచ్ సీఐ ఓవర్ యాక్షన్ విమర్శలకు దారితీసింది. దుర్గమ్మ దర్శనానికి ముఖ్యమంత్రి దంపతులు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, దేవస్థాన ఈవో కేఎస్ రామారావులతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించి కిందస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగానే కొండపై మీడియా పాయింట్‌ను కూడా ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులందరూ మీడియా పాయింట్ వద్ద నిలబడి ఉండగా స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు అత్యుత్సాహం ప్రదర్శించి మీడియా పాయింట్ వద్ద ఎవ్వరూ ఉండవద్దంటూ చెప్పడంతో కొందరు మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీంతో ఆయన మరింత ఆవేశంగా మీడియా ప్రతినిధులపై ఊగిపోయాడు. సీఐ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సేవలోనే ఇంకా తరిస్తున్నారని విమర్శలు వినిపించాయి. ప్రభుత్వం మారినప్పటికీ ఆయన తీరు మారకపోవడం పోలీస్ వర్గంలోనే చర్చానీయాంశమైంది.

కృష్ణానదిలో దూకి మహిళ మృతి



వన్‌టౌన్, జూన్ 13 : కానూరుకు చెందిన ముసునూరి పద్మిని (53) ప్రకాశం బ్యారేజీ కృష్ణా నదీ 55వ ఖానా నుంచి నదీలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. కానూరులో పద్మిని దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు. అమెరికాలో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం వరకు పద్మిని ఇంటిలోనే ఉంది. ఆ తరువాత ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌తో బయటకు వచ్చినట్టు సమాచారం. ప్రకాశం బ్యారేజీ 55వ ఖానా వద్ద తనవెంట తెచ్చుకున్న బ్యాగ్‌ను పక్కన పెట్టి బ్యారేజీపై నుంచి నదీలో దూకింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ప్రకాశం బ్యారేజీ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు తెలియజేశారు. వన్‌టౌన్ పోలీసులు రెస్క్యూ టీం సహాయంతో కృష్ణానదీలో గాలించి పద్మిని మృతదేహాన్ని వెలికితీశారు. బ్యారేజీ వద్ద లభించిన బ్యాగులో ఉన్న ఆధారాల ద్వారా ఆమె భర్త, బంధువులకు సమాచారం తెలియపరిచారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పద్మిని ఆత్మహత్య వివరాలు తెలియాల్సి ఉంది.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూకల దాడి

ఘంటసాల, జూన్ 13 : లంకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గువ్వాబత్తిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, అతడి కుటుంబసభ్యులు, అనుచరులు బుధవారం రాత్రి దాడి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలతో వస్తున్న బాలకృష్ణపై మాడెం నాగరాజు, మాడెం బాలాజీ, మాడెం కోటేశ్వరరావు, కొండపల్లి ఆంజనేయులు, కళ్లేపల్లి శ్రీనివాసరావులు కర్రలతో దాడి చేశారు. దాడిలో బాలకృష్ణ తల, మెడపైన తీవ్ర గాయాలు కావటంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

దుర్గమ్మ సేవలో కొత్త మంత్రులు..



దుర్గమ్మ దర్శించిన బి.సి జనార్దన్‌రెడ్డి



మంత్రి వంగలపూడి అనిత



మంత్రి గుమ్మడి సంధ్యారాణి

వన్‌టౌన్, జూన్ 13 : దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం పలువురు మంత్రులు విచ్చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి దంపతులు ఆలయానికి విచ్చేయడంతో పాటు పలువురు మంత్రులు కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. కొత్త ప్రభుత్వంలో నూతన మంత్రులు రావడంతో ఆలయ అధికారులు వారి కోసం ఆలయ మర్యాదలను అందించడంలో బిజీబిజీగా గడిపారు. రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత, బీసీ జనార్దనరెడ్డిలు వారి వారి కుటుంబసభ్యులతో వేరు వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో కేఎస్ రామారావు, అధికారులు వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

అమరావతి ఉద్యమం.. గొప్ప జీవిత పాఠం

▸ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

ఉంగుటూరు, జూన్ 13 : అమరావతి ఉద్యమం గొప్ప జీవిత పాఠమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. అమరావతి రైతులు, మహిళలు, ఇతరవర్గాల ప్రజల త్యాగం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో వివిధకోర్సుల్లో స్వయం ఉపాధిశిక్షణ పూర్తిచేసుకున్న యువతీయువకులకు గురువారం ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేసి ప్రసంగించారు. ఈసందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలు, ఇతర వర్గాలప్రజలు 1631రోజులపాటు శాంతియుతంగా ఉద్యమం చేయడం గొప్ప విషయం. స్వాతంత్ర్యోద్యమం తర్వాత అంత గొప్పగా జరిగిన ఉద్యమం ఇది. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో చారిత్రాత్మక ఉద్యమాన్ని నిర్వహించారు. చివరకు ప్రజల కోరిక నేరవేరడం సంతోషం, అమరావతే రాజధానిగా వుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన తర్వాత వారు ఉద్యమదీక్షను ఉపసంహరించుకోవడం అందరూ సంతోషించదగ్గ విషయం. 33వేల ఎకరాలు రాజధానికోసం స్వచ్ఛందంగా ఇవ్వడం దేశ చరిత్రలో ఎక్కడాలేదు. వాళ్లు ఇష్టపడి ఇచ్చారు. తర్వాత కష్టం వచ్చింది. ఇష్టంతోనే కష్టాన్ని ఎదుర్కొన్నారు. ఇప్పుడు మేలు జరిగింది. జీవితంలో మన మందరం నేర్చుకోవాల్సిన పాఠం ఇది అని చెప్పారు.



ధ్రువీకరణపత్రాలు అందుకున్న శిక్షణార్థులతో వెంకయ్య, ట్రస్ట్ ప్రతినిధులు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

రాజధాని ఒకటే.. ఒకచోటే ఉండాలి

రాజధాని లేని రాష్ట్రం తలలేని మొండెం వంటిదని ఈసందర్భంగా వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి మాటిచ్చినట్టు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తారని విశ్వసిద్దాం. నేను గతంలో కూడా చెప్పాను, రాజధాని ఒకటే ఉండాలి, ఒకచోటే వుండాలి. చట్టసభ, పాలన వ్యవస్థ వంటివన్నీ ఒక చోట వుంటేనే సమన్వయంతో కలిసి పని చేయడానికి వీలవుతుంది. అభివృద్ధిని వికేంద్రీకరించాలి, రాజధానిని మాత్రం కేంద్రీకరించాలి. అన్నింటికీ కేంద్రంగా రాజధాని ఉండాలి. జిల్లాలతో రాజధాని అనుసంధానం జరగాలి, ప్రతిజిల్లా, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలి. ప్రాంతీయ అసమానతలకు తావీయకుండా సమతుల్యం పాటించాలి.

యువత రాజకీయాల్లోకి రావాలి

జీవితంలో స్థిరపడిన తర్వాత యువత రాజకీయాల్లోకి రావాలని వెంకయ్య పిలుపునిచ్చారు. యువతలో నిజాయితీ వుంటుంది.. వారొస్తే రాజకీయాలు బాగుపడతాయి. రాజకీయాలంటే ఈసడించుకునే పరిస్థితిని కొంతమంది నేతలు తీసుకొచ్చారు. బూతులు మాట్లాడేవారికి పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలని నేనే గతంలో అనేక వేదికల్లో చెప్పాను. ఇటీవల ఎన్నికల ఫలితాల్లో అలాంటి నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు.

రామోజీనుంచి ఎంతో నేర్చుకున్నా

బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు నుంచి తానెంతో నేర్చుకున్నానని వెంకయ్యనాయుడు చెప్పారు. స్వయంకృషితో పైకొచ్చి, వేలమందికి ఉద్యోగాలిచ్చిన గొప్ప వ్యాపారవేత్త, ప్రతిభాశీలి, దేశమంతా గర్వించే స్థాయిలో ఫిలింసిటీని ఏర్పాటుచేసిన రామోజీరావు గురించి యువతరం తెలుసుకుని, వారి జీవితంనుంచి స్ఫూర్తిని పొందాలి. రామోజీరావు చాలా రంగాల్లో అపూర్వ విజయాలు సాధించారు, ఏ విషయాన్నైనా ఆయన సునిశితంగా అధ్యయనం చేసేవారు, వారితో ఎన్నో సందర్భాల్లో మాట్లాడాను. వారినుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెంకయ్య తెలిపారు. ఈసందర్భంగా అందరూ లేచి నిలబడి రామోజీరావుకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం వెంకయ్య యువతకు విలువైన సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో జె.శరత్‌బాబు, సెక్రటరీ చుక్కపల్లి రామకృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.పరదేశి, వివిధ శిక్షణాసంస్థల డైరెక్టర్లు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

విశాఖ-కడప రైళ్ల నెంబర్లు మార్పు

▸ జూలై 1 నుంచి కొత్త నెంబర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ డివిజన్ పరిధిలోని పలు రైళ్ళ నెంబర్లను అధికారులు మార్చారు. జూలై 1 నుంచి పలు రైళ్ల నెంబర్లు మారతాయి. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ రిజర్వేషన్ పోర్టల్‌లో కూడా రైల్వే అధికారులు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. విశాఖపట్నం-కడప మధ్యన రైలు నెంబర్ ప్రస్తుతం 17488గా ఉంది. ఇక మీదట 18521గా ఉంటుంది. అలాగే కడప-విశాఖపట్నంల మధ్యన నడిచే రైలు నెంబర్ ప్రస్తుతం 17487గా ఉంది. దీనిని 18522గా మార్చారు.

బెజవాడ-విజయవాడ సెక్షన్‌లో ఇటీవల భారీగా రద్దు చేసిన 21 రైళ్లను రైల్వే అధికారులు తిరిగి పునరుద్ధరించారు. ట్రాఫిక్ మెయింట్‌నెన్స్ పేరుతో మొత్తం 21 రైళ్ళను రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు. రద్దు చేసిన ఈ రైళ్ళన్నింటినీ పునరుద్ధరిస్తున్నట్టు రైల్వే తాజాగా ప్రకటన విడుదల చేసింది. విజయవాడ - గుంటూరు, గుంటూరు - రేపల్లె, రేపల్లె - తెనాలి, తెనాలి - విజయవాడ, విజయవాడ - గూడూరు, గూడూరు - విజయవాడ, విజయవాడ - మాచర్ల, మాచర్ల - విజయవాడ, విజయవాడ - తెనాలి, తెనాలి - రేపల్లె, రేపల్లె - మాచెర్ల, తెనాలి - రేపల్లె, రేపల్లె - గుంటూరు, గుంటూరు - తెనాలి, రేపల్లె - గుంటూరు, గుంటూరు - తెనాలి, తెనాలి - రేపల్లె, రేపల్లె - మార్కాపూర్, మార్కాపూర్ - రేపల్లె, తెనాలి-గుంటూరు, గుంటూరు - విజయవాడ, విజయవాడ-కాకినాడ పోర్టు రైళ్ళన్నింటినీ ఈ నెల 21 వ తేదీ నుంచి ఆగస్టు 15 వ తేదీకి పునరుద్ధరించారు.

చెన్నై సెంట్రల్-సంత్రగచిల మధ్య రద్దీ దృష్ట్యా గురువారం ప్రత్యేక రైళ్ళను నడిపింది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచిల మధ్యన ట్రైన్ నెంబర్ 06005, సంత్రగచి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌ల మధ్యన 06006లను రైల్వే అధికారులు నడిపారు.

అభివృద్ధి పథాన నడిపిస్తా

▸ ప్రజలు తిరుగుబాటుతో వైసీపీని సాగనంపారు

▸ అరాచకాలు తాళలేక కసితో ఓటు వేశారు

▸ బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని నమ్మి అధికార బాధ్యతలను అప్పగించారని, ఇకపై ప్రజల మనసెరిగి పనిచేస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతల అరాచక పాలనను సాగనంపాలనే కసితో ఓటర్లు కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమైనా.. ఈసారి ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటును ప్రదర్శించి వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలు 50వేలకు పైగా మెజారిటీ ఇచ్చి గత ఎమ్మెల్యే పనితీరుకు సరైన గుణపాఠం చెప్పారన్నారు.

ఎవరూ అరాచకాలకు పాల్పడవద్దు..

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జనసైనికులు క్రమశిక్షణతో నడుచుకోవాలని చెప్పారని ఎంపీ బాలశౌరి అన్నారు. వైసీపీ పాలకుల మాదిరిగా అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడవద్దని, ప్రజలకు మేలు చేసే అంశాలపైన దృష్టి సారించాలన్నారు. తప్పుచేసిన వారికి చట్టపరంగా శిక్షపడేలా చేస్తామన్నారు. ఎంపీగా నియోజకవర్గాల్లో ప్రథమ కర్తవ్యంగా తాగునీటి సమస్యను తీరుస్తామన్నారు. మంత్రి పవన్‌కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి జిల్లా ప్రజలకు శుద్ధిచేసిన నీటిని అందించేలా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. తాగునీటి అవసరాలకు కేంద్ర నిధులను తీసుకువస్తానన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

ఏడాదిన్నర కాలంలో బందరుపోర్టు పనులు పూర్తి

వచ్చే ఏడాదిన్నరకాలంలో పోర్టును పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి జిల్లా ప్రజలకు అంకితం చేస్తామన్నారు. నాలుగైదు వేలఎకరాల్లో పోర్టు అనుబంధ పరిశ్రమలను స్థాపించి వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ నేతలతో అనేక ఇబ్బందులు పడ్డానని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కూటమి నాయకులంతా అన్నదమ్ముల్లా కలిసి, ఎలాంటి విభేదాలు లేకుండా ప్రజలకోసం పనిచేస్తామన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, జనసేన నేతలు బండి రామకృష్ణ తదితరులు తనను వెంటబెట్టుకుని ప్రజల వద్దకు తీసుకువెళ్లారన్నారు. జిల్లాలో చేసిన పనులను ప్రజలకుచూపిన తర్వాతే ఓట్లు అడుగుతామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కూటమి నాయకులు ఎంపీ బాలశౌరిని ఘనంగా సత్కరించారు.

సచివాలయ ఉద్యోగుల చేతివాటం!


▸ స్థానికేతరులకు పింఛన్లు

▸ ఇద్దరు ఉద్యోగులు ఆన్‌లైన్‌లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్

మోపిదేవి, జూన్ 13 : గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు ఇష్టారీతిన చేతి వాటం ప్రదర్శించి అక్రమాలకు పాల్పడిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మోపిదేవి మండలంలోని వెంకటాపురం గ్రామసచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులు అవనిగడ్డ, గుంటూరు ప్రాంతాల్లో నివాసముంటూ వెంకటాపురం గ్రామంలో నివాసముంటున్నట్టు ఆన్‌లైన్‌లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నమోదైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇరువురు ఉద్యోగులు వివాహం కాకపోయినా వేరే ప్రాంతంలో నివాసముంటూ వెంకటాపురంలో నమోదు కాబడి, ఇరువురి తల్లిదండ్రులకు పింఛన్లకు నమోదు చేసుకోవటం వారి చేతివాటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అన్ని అర్హతలు కలిగి పింఛన్ మంజూరు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగేవారు కొందరైతే.. స్థానికులు కానప్పటికీ అక్రమంగా పింఛన్ నమోదు చేసుకోవడం వెనుక గ్రామ, మండల స్థాయి అధికారుల అండదండలతోనే జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. పింఛన్ నమోదుకు గ్రామ సచివాలయంలో దరఖాస్తును పంచాయతీ కార్యదర్శి పరిశీలించి, మండల పరిషత్ అధికారి పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో అప్‌లోడ్ చేయటం జరుగుతుంది. వెంకటాపురం సచివాలయంలో అవనిగడ్డ మండలానికి చెందిన వ్యక్తులకు పింఛన్ మంజూరు చేయటం వెనుక అధికారుల చేతివాటం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. గతేడాది మోపిదేవి మండలంలో అర్హులైన 175 మంది పింఛన్ లబ్ధిదారులు చనిపోయినట్టు రికార్డులో అధికారులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అర్హత లేకున్నా.. స్థానికులు కాకున్నా 2023 ఆగస్టు 25వ తేదీన దివ్యాంగుల పింఛన్‌గా అవనిగడ్డకు చెందిన లుక్కా వెంకటపిచ్చియ్య అనే వ్యక్తికి మంజూరు చేసినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాసరావు వివరణ కోరగా, సచివాలయ ఉద్యోగులు అవినీతి విషయమై విచారణ చేసి తగు చర్యల నిమిత్తం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. భార్యాభర్తలు, కుటుంబసభ్యులు మాత్రమే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కావాల్సి ఉంటుందని, సచివాలయంలో పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కావటం సరికాదన్నారు.



వెంకటాపురం గ్రామ సచివాలయం



పింఛన్ పొందుతున్నట్టు ఆన్‌లైన్ నివేదిక



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు

విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల సమగ్రాభివృద్ధి

▸ 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలి

▸ వసతి గృహాలపై సమీక్షలో కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జూన్ 13 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విలువలతో కూడిన విద్య ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు, ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో ప్రవేశాలు, బోధన, నిర్వహణ, గత పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో ప్రవేశాలు జరిగేలా చూసి నాణ్యమైన బోధన అందించేందుకు, వసతి కల్పించేందుకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో ప్రీ మెట్రిక్ 25, పోస్ట్ మెట్రిక్ 13 వసతి గృహాల్లో 2,095 మంది విద్యార్థులకు అవకాశముందని, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. వసతి గృహాలల్లో వుండి చదువుకొంటున్న ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని, కెరీర్ పరంగా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొనేలా నైపుణ్యాలను అందించాలన్నారు. గత పరీక్షల్లో ఫలితాలను విశ్లేషించుకొని ఏవైనా లోపాలు వుంటే సరిదిద్ది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విలువలతో బయటకు వచ్చినప్పుడు వారి తల్లిదండ్రులకు కలిగే ఆనందం వర్ణనాతీతమని పేర్కొన్నారు. సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి వున్నారో ఆయా అంశాలపై పట్టు సాధించేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మంచి ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. తరచుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనిల్, సూపరింటెండెంట్ ఎ.ఆంజనేయులు, సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహపు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జూన్ 13 : ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివృద్ధి వ్యూహాలను ప్రణాళికాయుతంగా అమలు చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని, ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులకు సూచించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో కలిసి ఆర్అండ్‌బీ భవంతిలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఆకాంక్షిత బ్లాక్‌లలో వివిధ సూచికల్లో ప్రగతిపై నీతి ఆయోగ్ సీఈవో మార్గనిర్దేశనం చేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో సామాజిక, ఆర్థిక సూచికల్లో ప్రగతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఐదు కేటగిరీలకు సంబంధించి ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, అనుబంధ రంగాలు, తాగునీరు, పారిశుధ్యం, ప్రాథమిక మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళిత రంగాల్లో మొత్తం 40 సూచికల్లో ప్రగతిని నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందన్నారు. అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ సూచికల్లో ప్రగతిని కనబరచవచ్చని, ఇందుకు విద్య, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యం, ఆసుపత్రుల్లో ప్రసవాలు, హైపర్ టెన్షన్ స్క్రీనింగ్, ఐసీడీఎస్ కార్యక్రమాల ద్వారా పోషకాహారం పంపిణీ తదితర సూచికలపై దృష్టి సారించాలన్నారు. వర్చువల్ సమావేశంలో పెనుగంచిప్రోలు ఎంపీడీవో సాయిహర్ష, ఈవో (పీఆర్ అండ్ ఆర్డీ) ఎం.వరప్రసాద్, ఏబీపీ బ్లాక్ కో-ఆర్డినేటర్ మోహన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన కృష్ణా జట్టు

సీనియర్ మహిళా వన్డే టోర్నీ విజేత కృష్ణా

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 13 : నర్సరావుపేట పేరిచర్లలో జరుగుతున్న ఏసీఏ సీనియర్, అండర్-23 ఉమెన్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతగా కృష్ణా ఉమెన్ జట్టు నిలిచింది. గురువారం గుంటూరుతో జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా టీమ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాట్‌పట్టిన గుంటూరు 50 ఓవర్లలో 196/8 పరుగులు చేయగా, కృష్ణా జట్టు 42.3 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి 197 పరుగులను చేసి విజేతగా నిలిచింది. బ్యాటర్స్ ఎం. భావన 65 పరుగులు, అంజుమ్ 46, వర్ధిని 40 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. సెంట్రల్ జోన్ విజేతగా నిలిచిన కృష్ణా మహిళా టీమ్‌ను కేడీసీఏ అడహక్ కమిటీ ఛైర్మన్ టి. త్రినాథ్‌రాజు అభినందించారు.

బాలికను వేధించిన కేసులో జైలు శిక్ష

మచిలీపట్నం టౌన్, జూన్ 13 : కలిదిండి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారగాని అయ్యప్ప అనే వ్యక్తి మైనర్ బాలికను వేధించినందుకు మచిలీపట్నం పోక్సో కోర్టు జైలు శిక్ష విధించింది. 2021 మే 22న మైనర్ బాలిక కిరాణా షాపుకు వెళుతుండగా అయ్యప్ప మద్యం సేవించి వేధించాడు. దీనిపై పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు విచారణ అనంతరం తీర్పు ఇచ్చారు. అయ్యప్పకు 6 నెలల జైలు శిక్ష, రూ. 21వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ ముంజులూరు వెంకట మహేష్‌కుమార్ 8 మంది సాక్షులను విచారించి వాదనలు వినిపించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	288
చికెన్ స్కిన్‌లెస్	298

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30



మంత్రి ఫరూక్‌కు ఖుద్దూస్ శుభాకాంక్షలు

ఉయ్యూరు : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్ఎండీ ఫరూక్‌కు ఉయ్యూరు నగరపంచాయతీ మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకుడు అబ్దుల్ ఖుద్దూస్ విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిగా, ఎమ్మెల్సీగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మండలి ఛైర్మన్‌గా పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు.



కేసరపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పొట్లూరి బసవరావు



తెలుగు యువత ఆధ్వర్యంలో కేక్ కేస్తున్న దయాల రాజేశ్వరరావు తదితరులు



నారాయణపురం కాలనీలో మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ శ్రేణులు

చంద్రబాబు సీఎం కావడంతో టీడీపీ సంబరాలు

గన్నవరం, జూన్ 13 : అంధకారంలో రాష్ట్రానికి వెలుగులు వచ్చాయని ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. కూటమి అధికారంలోకి రావ టంతో గురువారం కేసరపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తీన్‌మార్ డప్పులతో భారీ ప్రదర్శన చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ గాడి తప్పిన పాలన పరుగులు తీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిషోర్, జాస్తి శ్రీధర్ (చిన్ని), పలగాని బాలకృష్ణ, సుధాబత్తుల రామకృష్ణ, మేడూరు శేషకుమార్, జంపన బుజ్జి, చంద్రశేఖర్, ప్రతాప్, శ్రీనివాసరావు, అన్నే అంజిబాబు, జాస్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్** : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయ కత్వంలో తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని టీడీపీ బాపుల పాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. ఇంది రానగర్‌లో తెలుగు యువత ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆశయాలను కూటమి ప్రభుత్వం తప్పకుండా నెరవేర్చుతుం దన్నారు. చెరుకూరి హరికృష్ణ, చీలి ఆనంద్, పరసా కిట్టు, పొట్లూరి బెనర్జీ, వరిగంజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు** :సాయం కోసం వచ్చిన రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్క రించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారని సొసైటీ మేనేజర్ జాహ్నవి అన్నా రు. కోపరేటివ్ సొసైటీ కార్యదర్శులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందించాలన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా నాయకులు మద్దాలి సాయిబాబు, సూపర్‌వైజర్ జ్యోతి, కార్యదర్శులు పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలకు కాలినడకన బయలుదేరిన జంపాల



మొక్కు తీర్చుకున్న సూరిబాబు తదితరులు

కాలినడకన ద్వారకా తిరుమలకు...

హనుమాన్‌జంక్షన్ రూరల్ : ప్రజాసంక్షేమంతో కూడిన రాష్ట్రాభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబుకు ఉందని టీడీపీ నాయకులు జంపాల సుబ్బారావు, కలపాల నాని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో ద్వారకాతిరుమలలో మొక్కులు చెల్లించేందుకు గురువారం కాలినడకన బయలుదేరారు. జంపాల సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రుల జీవనాడి పోలవరం, రాష్ట్ర రాజధాని అమరావతి త్వరితగతిన పూర్తి చేసేలాప్రభుత్వానికి ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆశీస్సులు అందజేయాలని కోరనున్నట్టు తెలిపారు. సుబ్బారావుతో కలిసి కలపాల శ్రీధర్, పాలడుగు శ్రీకాంత్, కలపాల నాని, కాకరాల గిరిధర్, తోట రాఘవరావు, బోయపాటి ప్రసాద్‌లు బయలుదేరారు.

కోడూరుపాడు ప్రజలు..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీ కూటమి గెలుపుతో పాటు యార్లగడ్డ వెంకట్రావు ఘన విజయం సాధించడంతో కోడూరుపాడు మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు మొక్కులు తీర్చుకున్నారు. సూరిబాబుతోపాటు పాండురంగారావు, శివ తదితరులు చిన్నతిరుపతిలో గురువారం తమ మొక్కులు చెల్లించారు. గ్రామాల్లో కనీస మౌలికసదుపాయాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో బి.పాండురంగారావు, పి.శివ, నాగిరెడ్డి, కె.సాంబయ్య, పాపారావు, గండి శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో..

గన్నవరం : టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో పాటు యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలవటంతో టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, కార్యదర్శి చిమట శ్రీనివాసరావు మొక్కు తీర్చుకున్నారు. గురువారం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి వెళ్లి తల నీలాలు ఇచ్చి, ప్రత్యే క పూజలు చేశారు. నాయకులు జాస్తి ఫణిశేఖర్, మోదుగుమూడి వేణు, చిలకపాటి సుబ్బారావు, ఆసిఫ్‌ఖాన్, కాసన్నేని నాని, వెంకట్ పాల్గొన్నారు.

కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకొన్న టీడీపీ శ్రేణులు

పెనమలూరు, జూన్ 13 : నారాయణపురం కాలనీకి చెందిన టీడీపీ నాయకులు కంచర్ల పూర్ణచంద్రరావు, కంచర్ల సుకన్య, కంచర్ల రోహిత్, తుమ్మల కిరణ్‌కుమార్, వై శివరామరాజు, గుత్తా రామకృష్ణ, మండవ వీరయ్యచౌదరి, కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిస్తే అన్ని కొబ్బరికాయలు కొడతామని మొక్కుకున్న మేరకు గురువారం 164 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకొన్నారు.

జిల్లా మంత్రులకు శుభాకాంక్షలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కొల్లు రవీంద్రను విజయవాడలోని ఆయన స్వగృహంలో, కొలుసు పార్థసారధిని తాడిగడపలోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన చిరుమామిళ్ల సూర్యం వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులుగా జిల్లాను మరింత అభివృద్ధిపథం నడిపిస్తారని అభిలషించారు. **ఉయ్యూరు** : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొలుసు పార్థసారథికి ఉయ్యూరు మండలపార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబ రావు, చినఓగిరాల పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ సాయి తదితరులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు. పాలడుగు రామకృష్ణ, కోటేశ్వర రావు, పాలడుగు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తాడిగడప వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెనమలూరు, జూన్ 13 : తాడిగడప లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఐదున్నరకు సుప్రభాత సేవ, నిత్యార్చన, తీర్థప్రసాద గోష్టితో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దాతలచే ఉదయం ఎనిమిదిన్నరకు నూతన ఆభరణాలు సమర్పించిన అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ఆరాధన, కుంభారాధన నిర్వహించారు. పదిన్నరకు తిరుప్పావడ సేవ, పూలంగి సేవ, నేత్ర దర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు శ్రీవారికి గరుడోత్సవం నిర్వహించారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు తేజోన్మయి



తేజోన్మయిని అభినందిస్తున్న సంతోష్‌కుమార్

గన్నవరం, జూన్ 13 : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ అన్నారు. వీఎస్ సెయిన్స్ జాన్స్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని తేజోన్మయి జాతీయ స్థాయి ఫెన్సింగ్ అండర్-10 పోటీలకు ఎంపికయ్యింది. ఈ నెల 16, 17 తేదీల్లో ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి అండ్-10, 12 బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. తేజోన్మయి రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గురువారం పాఠశాలలో తేజోన్మయిని పలువురు అభినందించారు.



మురళీమోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యార్లగడ్డ సతీష్, ఆళ్ల గోపాలకృష్ణ, యనమదల సుధాకర్, తదితరులు.

మురళీమోహన్ మృతి తీరని లోటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 13 : గ్రామాభివృద్ధికి సహకారమందించే మొవ్వా మురళీమోహన్ మృతి బాధాకరమని, ఆయన లేని లోటు తీర్చలేనిదని యార్లగడ్డ సతీష్, ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో మొవ్వా మురళీమోహన్ చిత్రపటానికి గురువారం టీడీపీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పుట్టా సురేష్, మొవ్వా శ్రీనివాసరావు, కసుకుర్తి అర్జునరావు, యనమదల సుధాకర్, యెనిగళ్ల జ్ఞానశేఖర్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీవో బేబీ సుకన్య తదితరులు

అంగన్వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య

కంకిపాడు, జూన్ 13 : అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు కంకిపాడు సీడీపీవో సుకన్య అన్నారు. మండల పరిధిలోని 4వ అంగన్వాడీ కేంద్రంలో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఆటలలోనూ చిన్నారులను తీర్చిదిద్దున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.ఎస్.కె రమా, షరాబి, వై. నళిని కుమారి, కె. భవాని, ఎం. రత్నకుమారి పాల్గొన్నారు.

అసంపూర్తిగా వాటర్ ట్యాంకు నిర్మాణం



రాఘవయ్య నగర్‌లో అసంపూర్తిగా వాటర్ ట్యాంక్

ఉయ్యూరు, జూన్ 13 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి రాఘవయ్య నగర్‌లో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 97.1లక్షలతో చేపట్టిన 2.5లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. శివాలయం రోడ్డులో పాత వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేశారు. దాని స్థానంలో ఎక్కువ లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మించేందుకు అనువైన స్థలం కోసం అన్వేషించి ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల రోడ్డులోని రాఘవయ్య నగర్‌లో ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంట్రాక్టరు పిల్లర్లు లేపాడు. అయితే బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. నిర్మాణ పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు కావస్తున్నా పూర్తిచేయక పోవడంతో డైరెక్ట్ పంపింగ్ ద్వారా వచ్చే నీరు సరిపోక పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పనులు ప్రారంభమవుతాయి

కాంట్రాక్టరుకు ఇటీవల బిల్లులు చెల్లింపు జరిగింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు తిరిగి ప్రారంభించ లేదు. కాంట్రాక్టరు త్వరలో పనులు ప్రారంభిస్తారు.

\- జె.రాజేశ్, ఏఈ, నగరపంచాయతీ

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 13 : ఏలూరు రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కోడూరుపాడుకు చెందిన శివప్రసాద్ దంపతులు 500 మందికి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం నగర సంకీర్తనతోపాటు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొల్లి వెంకటరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై తొలి సంతకం అభినందనీయం

కంకిపాడు, జూన్ 13 : చంద్రబాబు ఇచ్చిన హామీలపై తొలసంతకం చేయడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, వృద్ధులకు పింఛన్ తదితర వాటిపై సంతకాలు చేయటంతో ప్రజలు ఒక నమ్మకాన్ని కలిగించారన్నారు. పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.





సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సీఎం చంద్రబాబుకు మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నాయకులు,మచిలీపట్నం జ్యూయలరీ పార్కు ప్రతినిధులు జి. రామబ్రహ్మం శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. **గుడివాడ** : ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కనకదుర్గ అమ్మవారిని చంద్రబాబు దర్శించుకున్నారు. వెనిగండ్ల పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.



మంత్రి కొల్లు రవీంద్రకు ఎస్పీ శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్ : మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు



ఎంపీ బాలశౌరికి శుభాకాంక్షలు తెలుపుతు టీడీపీ, జనసేన కార్పొరేటర్లు



మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపు సత్యనారాయణ



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న గొర్రెపాటి, చౌదరిబాబు



చౌటపల్లిలో కేక్‌కట్ చేస్తున్న అట్లూరి రమణ ప్రసాద్ దంపతులు

పౌరాణిక పద్యనాటకాలు అదుర్స్

చల్లపల్లి : ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో బోలెం భాస్కరరావు ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులోని ఎన్టీఆర్ కళావేదికపై ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాపరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు బాలనాగమ్మ నాటకంలోని మాయలపకీరుగా అత్యద్భుతంగా నటించారు. బెల్లంకొండ ఏడుకొండలు బ్రహ్మంగారిగా, సిద్ధయ్యగా పి.నాంచారయ్య నటించిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం (సంవాదం సీను) ఆకట్టుకుంది. పుప్పాల వీరాంజనేయులు నటించిన సత్యహరిశ్చంద్ర కాటిసీను సభికుల మన్ననలు అందుకుంది. సంగు, చంద్రమతిగా లక్ష్మీశ్రీ నటించారు. కొమ్మూరి నాగేశ్వరరావు ఆర్కెస్ట్రా సహకారం అందించారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, ఆహ్వానకమిటీ ప్రతినిధులు బోలెం నాగమణి, దాసి సీతారామరాజు, కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాం బాబు, ఈవో పి.వి.వరాధవేంద్ర రావు, బుల్లా కిషోర్, కైతేపల్లి దాస్, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, ఉప్పల సాంబశివరావు, నందేటి శ్రీను పాల్గొన్నారు. బోలెం రామారావును ఘనంగా సన్మానించారు.



మాయల పకీరుగా బోలెం రామారావు

మచిలీపట్నం నగరాభివృద్ధికి కృషి

• టీడీపీ కార్పొరేటర్లకు ఎంపీ బాలశౌరి హామీ

మచిలీపట్నం టౌన్, జూన్ 13 : మచిలీపట్నం నగరాభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. వల్లభనేని బాలశౌరిని టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయాదేవి కలిశారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని కోరారు. బాలశౌరి మాట్లాడుతూ అమృత్ పథకం కింద రావాల్సిన రూ.57.33 కోట్ల నిధులను మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే పేర్ని నాని రాకుండా అడ్డుకున్నారన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ ఇంజనీర్లతో నగరపాలక సంస్థ అభివృద్ధిపై సమీక్షించారు. బాలశౌరిని ఫోటోగ్రాఫర్ల సంఘ నాయకులు చిలంకుర్తి శేషు తదితరులు కలిసి తమ సమస్యలను వివరించారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని కోరారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ప్రతినిధులు వేమూరి రామకృష్ణారావు, పి.వి. ఫణికుమార్ తదితరులు కలసి పట్టాభి స్మారక భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. టీడీపీ, జనసేన నాయకులు గజమాలతో బాలశౌరిని సత్కరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకులు గడ్డం రాజు, కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము, టీడీపీ నాయకులు ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, సనకా నాగులు, తలారి సోమశేఖర్, కొక్కిలిగడ్డ నాగరమేష్ తదితరులు బాలశౌరిని అభినందించారు.

రైతు సమస్యలపై వినతి

మచిలీపట్నం టౌన్ : కృష్ణాడెల్టా రైతుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి కొల్లు రవీంద్రను తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కోరారు. మంత్రి కొల్లు రవీంద్రను తెలుగురైతులు గురువారం కలిసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలువ చివరి భూములకు నీరందించేందుకు కాల్వలకు పూడికలు తీయించాలని కోరారు. రైతులకు మెరుగైన వరివంగడాలు , ఎరువులు, నాణ్యత గల పురుగుమందులు ఇప్పించాలని కోరారు. తెలుగు రైతులుపామర్తి లక్ష్మణ్, బడే రమణ, గోపు నరేష్, గోపు మహేష్ పాల్గొన్నారు.

పూడికతీత పూర్తి చేయాలి

అవనిగడ్డ : నియోజకవర్గంలో పంట కాలువల పూడికతీత పనులను త్వ రగా పూర్తి చేసి చివరి భూముల వరకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండలి తన ఇంటి వద్ద ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చివరి భూములైన ఇరాలి, రామకృష్ణాపురం, సొర్లగొంది, గుల్లలమోద ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల విషయంలో త్వరగా నివేదిక అందించాలన్నారు. దివి ప్రాంత ప్రజ ల వరప్రదాయిని అయిన పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మతు పనులపై వెంటనే స్పష్టత ఇవ్వాలన్నారు. బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్, ఇరిగేషన్ డీఈ రవి కిరణ్, ఏఈలు పాల్గొన్నారు

టీడీపీ సంబరాలు



చల్లపల్లి : నాదెళ్ల వారిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు సంబరాలు నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. యువనేత మండలి వెంకట్రామ్, మండల టీడీపీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు నాదెళ్ల వెంకట నరసయ్య, వడ్లమూడి గోపీచంద్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, పార్టీనేతలు మాతంగి వేణు, గుత్తికొండ వంశీకృష్ణ, షేక్ నబీషోరి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు భోజనాలు ఏర్పాటుచేశారు. **ఘంటసాల :** అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి ఘంటసాల విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్‌ను టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, కార్యదర్శి పరిశె చలపతి, గ్రామ ఉపసర్పంచ్ అయిన పూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** చౌటపల్లి గ్రామంలో అట్లూరి రమణ ప్రసాద్ దంపతులు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, చౌటపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అట్లూరి పద్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గుడ్లవల్లేరులోని ఎన్టీఆర్, బృందావన్ కాలనీ వాసులు, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. గ్రామ మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకట్రావు, వై.పి.సి ప్రసాద్, కోగంటి రాధాకృష్ణ, నాగులు, నిమ్మగడ్డ శశికళ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మెగా డీఎస్సీతో కలిసి ఐదు సంతకాలు చేసిన సందర్భంగా కూటమి నేతలు ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** మోపిదేవి ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యకర్తలకు తినిపించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, సాంబయ్య పాల్గొన్నారు.

రామాలయం సందర్శన



తోట్లవల్లూరు : ఐలూరు శివారు ములకలపల్లిలంక రామాలయాన్ని గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరాముడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శిరామ్‌ప్రసాద్, ఐలూరు సర్పంచ్ పీరాటి సుజాత, తాడిశెట్టి నరేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్, టీడీపీ నాయకులు బూరగడ్డ వీరబాబు, దావులూరి చినబాబు, కమ్మెల సాంబశివరావు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు అభినందనల వెల్లువు

అవనిగడ్డ : ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన మండలి బుద్ధప్రసాద్‌ను ఏఎస్‌డబ్ల్యూవో సాల్మన్ రాజు, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బందితో కలసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర నాటక అకాడమీ మాజీ వైస్ ఛైర్మన్ కందిమళ్ల సాంబశివరావు హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా సత్కరించారు. బుద్ధప్రసాద్‌ను అవనిగడ్డ, మొవ్వ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ జె.జయప్రద, శ్యామల నేతృత్వంలో వ్యవసాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. **అవనిగడ్డ రూరల్ :** అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌ను పులిగడ్డ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.



రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పెడన, జూన్ 13 : పెడన - గుడివాడ రోడ్డులోని బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతిచెందాడు. కొంకేపూడి గ్రామం నుంచి టీవీఎస్ మోపెడ్‌పై పెడన వైపు వస్తున్న రాజులపాటి గిరిరాజు (70)ను ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గిరిరాజును బం దరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఎస్సై సూర్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మోపిదేవి : లారీ - ద్విచక్ర వాహనం ఢీకొని రావి వెంకట పూర్ణచంద్రరావు గాయపడిన సంఘటన మోపిదేవిలో గురువారం రాత్రి జరిగింది.

లక్ష్మీపురం గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు మోపిదేవి నుంచి చల్లపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అవనిగడ్డ వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పూర్ణచంద్రరావు తలకు గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోపిదేవి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సీఎం చంద్రబాబుకు మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నాయకులు,మచిలీపట్నం జ్యూయలరీ పార్కు ప్రతినిధులు జి. రామబ్రహ్మం తదితరులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. **గుడివాడ :** నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో కనక దుర్గ అమ్మవారిని చంద్రబాబు కుటుం బసమేతంగా దర్శించుకున్నారు. వెనిగండ్ల పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.



పెదకళ్లేపల్లిలో వైభవంగా మహాకుంభాభిషేకం

మోపిదేవి, జూన్ 13 : పెదకళ్లేపల్లిలో బ్రహ్మసూత్ర లింగ ధారణలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామివారికి మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది.ఇ నాలుగు రోజులుగా జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ 9.18 నిముషాలకు ఆలయ శిఖరమున హైదరాబాద్‌కు చెందిన భారతి శంకర పీఠాధిపతి అన్నవరపు తిరుపతి మూర్తి మహాకుంభాభిషేకాన్ని ప్రారంభించారు. భక్తులు 1118 కలశాలతో ఆలయ శిఖరాలకు జలాభిషేకం గావించారు. వేదమంత్రోచ్చరణ నడుమ మహా పూర్ణాహుతి పూర్తిగావించారు. స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దక్షిణ కాశీ, ఉత్తర వాహినియై కృష్ణానది ప్రవహిస్తున్న పెదకళ్లేపల్లిలో స్వామివారు బ్రహ్మసూత్ర లింగం విశిష్టత కావటంతో మహాకుంభాభిషేకం నిర్వహించటం ద్వారా ఈ ప్రాంతాలు సుఖ సంతోషాలతో, ధనధాన్యాలతో వర్థిల్లుతాయని వేదపండితులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.





ఘనంగా ఆర్‌సీఎం చర్చి వందేళ్ల వేడుక



కోడూరు : పెద ఉల్లి పాలెం యేసు తిరు హృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) వందేళ్ల వేడుకలు ముగిశాయి. మచిలీపట్నం ఫాదర్ జోజిబాబు మాట్లాడుతూ మన పూర్వీకులు చూపిన ఆధ్యాత్మిక బాటలో నేటితరం పయనించాలన్నారు. భవిష్యత్ తరానికి మనం ఆదర్శంగా నిలవాలన్నారు. అవనిగడ్డ విచారణ గురువు జి.సురేష్ మెర్లో మాట్లాడుతూ క్రీస్తు అందించిన మార్గంలో పయనించాలన్నారు. విచారణ గురువులు ప్రత్యేక ప్రార్ధన, పరలోక ప్రార్ధన, పరలోక జపం చేశారు. మెరకపాలెం విచారణ గురువు బాలశౌరి, మచిలీపట్నం విచారణ ఉప గురువు విజయ్, బంటుమిల్లి విచారణ గురువు మహేష్, పలువురు ఉపదేశికులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కోడూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని రామకృష్ణాపురం శివారు పిండివానిదిబ్బ గ్రామానికి చెందిన నాయుడు సీతారామయ్య (55) భార్య కృష్ణకుమారితో కలిసి బుధవారం ద్విచక్ర వాహనంపై కోడూరు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో మెరకగౌడపాలెం వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బండి జారి కింద పడ్డాడు. వెనుకగా వాటర్ ట్యాంక్‌తో వస్తున్న ట్రాక్టర్ సీతారామయ్య ఎడమ భుజంపై, కృష్ణకుమారి ఎడమ కాలుపై ఎక్కింది. వెంటనే 108 ద్వారా అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా సీతారామయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కృష్ణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు



తూడు తొలగింపు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు రక్షిత తాగునీటి పథకం చెరువులో గుర్రపుడెక్క, నాచు తొలగింపు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రక్షిత తాగునీటి పథకం చెరువులో గుర్రపుడెక్క, నాచు పెద్దఎత్తున పేరుకుపోయి తాగు నీరు కలుషితం అవుతుండడంతో యుద్ధప్రాతిపదికన పంచాయతీ నిధులతో పనులను నిర్వహిస్తున్నామని కార్యదర్శి నరసింహారావు తెలిపారు.



భావనారుషి కల్యాణం

పెడన : పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భద్రావతీ సమేత భావనా రుషి స్వామి ఆలయ దశమ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఐలూరి జయకిషోర్ పర్యవేక్షణలో నందం వెంకట హరీష్ నాగవెంకట సాయి, కావ్య దంపతులు కల్యాణోత్సవం, అన్నసమారాధన నిర్వహించారు. పూర్ణచంద్రరావు, చినబాబు, నాని, చిలుకోటి గోవిందు, బొడ్డు నవీన్, తుమ్మలచర్ల స్వామి,పాల్గొన్నారు.